క్లుప్తంగా

30, 31 తేదీల్లో పాఠశాలల కమిటీ సమావేశాలు

కారంచేడు: ఈ నెల 30, 31 తేదీలలో కారంచేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే కాంప్లెక్స్‌లో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల్లో 50 శాతం మంది ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలన్నారు. మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులకు ఈ నెల 31వ తేదీన స్వర్ణ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే కాంప్లెక్స్ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనదారులకు జరిమానా

బల్లికురవ: వాహనదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు సకాలంలో చెల్లిస్తూ ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని బల్లికురవ ఎస్సై వీ.వేమన కోరారు. ఆదివారం సాయంత్రం వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో పలు వాహనాలకు తనిఖీ చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించిన డ్రైవర్లకు, సరైన పత్రాలు లేని, హెల్మెట్, సీటు బెల్టు ధరించని 20 మందికి 2670 పెనాల్టీ విధించారు.

ప్రజా సత్తా జిల్లా, రాష్ట్ర కమిటీలు ఏర్పాటు

ఇంకొల్లు (చినగంజాం): ప్రజా సత్తా 35 అనుబంధ సత్తాల మండల, నియోజకవర్గ, శాసన సభ, పార్లమెంట్, జిల్లా, రాష్ట్ర జాతీయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు, గతంలో ప్రజా సత్తా కమిటీల్లో పనిచేసిన అన్ని వర్గాల ప్రజలు విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, రైతులు, కళాకారులు, వ్యాపార వేత్తలు, అన్ని మతాల పెద్దలు, రాజకీయ ఔత్సాహికులు సభ్యులుగా చేరి ప్రజాసత్తా పలు కమిటీల్లో నాయకులుగా అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 99893 85993 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

హుండీ ధ్వంసం



దుండగులు పగులగొట్టిన హుండీ

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ఆలయంలోని హుండీ ధ్వంసం చేసి చోరీకీ పాల్పడ్డారు. గ్రామస్తుల వివరాల మేరకు.. ద్రోణాదుల గ్రామ శివారులోని ద్రోణాదులమ్మ ఆలయంలో హుండీని ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి దుండగులు ఆలయంలో ప్రవేశించి హుండీ, తాళం పగులగొట్టి అందులో ఉన్న నగదును తస్కరించుకు వెళ్లారు. చోరీకి గురైన నగదు రూ.1000 అంతకు మించి ఉండవచ్చని అంచనా. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్పందనకు అధికారులు హాజరుకావాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల దినం 'స్పందన' కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారని తహశీల్దార్ తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు విధిగా స్పందనకు హాజరుకావాలన్నారు. అలానే మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో సోమవారం ఉదయం 11 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వారికి అవసరమైన అర్జీలను పెట్టుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాలకు చెందిన వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



అమ్మకానికి ఉంచిన కూరగాయలు

తగ్గుతున్న కూరగాయలు

కూరగాయలు	కిలో, రూ.
పచ్చిమిర్చి	80
బీరకాయలు	50
కాకరకాయలు	60
టమోటా	40
క్యారెట్	55
వంకాయలు	60
బెండకాయలు	50
ఆలుగడ్డ	40
బీట్‌రూట్	50
క్యాలిఫ్లవర్ (ఒకటి పువ్వు)	25
క్యాబేజీ	40
చేమ దుంపలు	45
దోసకాయలు	40
తోటకూర (కట్ట)	10
గోంగూర (కట్ట)	15
పచ్చి అరటి కాయలు (డజను)	50

- టమోటా కిలో రూ. 40
- క్రమేపీ పెరుగుతున్న ఉల్లి
- రూ. 60 లోపే ఇతర కూరగాయలు

వేటపాలెం:

ఎట్టకేలకు కూరగాయల ధరలు తగ్గాయి. ఎండల తీవ్రతతో కూరగాయలు రెండు నెల కిందట ధరలు దడపుట్టించాయి. అయితే అన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షాలు కురడంతో కూరగాయల పంటలు రైతులు సాగు చేశారు. ఆ పంటల తాలుకూ దిగుబడులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కి వస్తున్నాయి. దీనితో కూరగాయల ధరలు క్రమేపీ దిగివస్తున్నాయి. రికార్డు స్థాయిలో కిలో రూ. 200 వరకు పలికిన టమోట ప్రస్తుతం ధర తగ్గి రూ. 40కి చేరుకుంది. పచ్చి మిర్చి ప్రస్తుతం రూ. 150 నుంచి రూ.80 కి చేరుకుంది. అయితే సెప్టెంబర్ నాటికి కూరగాయల దిగుబడులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయి. అప్పుడు ప్రతి సాధారణ ప్రజలకు కూరగాయలు ధరలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి. గడిచిన పదేళ్లలో ఎప్పుడు లేని విధంగా టమోట అత్యధిక ధర పలికింది. ఇక మిగిలిన రకాలు కూరగాయలు రూ.70 నుంయి రూ. 100 పలికాయి. సామాన్యులకు చుక్కలు చూపించాయి. టమోట కొనాలంటేనే బెంబేలెత్తిపోయారు. కొంతరు టమోట కొనడం మానేశారు. అయితే వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీపై రూ.50 రైతు బజార్లలో విక్రయించింది. అయితే ప్రస్తుతం ఉల్లి ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. కిలో రూ. 40కి చేరుకుంది. రాబోవు కాలంలో ఉల్లి ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెప్తున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్



కార్యాలయం బయట ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్

మున్సిపల్ కార్యాలయానికి కొత్త సొబగులు

- ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ వాటర్ ఫౌంటెన్‌లు

చీరాల అర్బన్: ఈ ఫొటోలు చూస్తుంటే మెట్రో నగరాల్లోని షాపింగ్ కాంప్లెక్సులు గుర్తువస్తున్నాయి కదా..! అలా అనుకుంటే మన కళ్లను మనమే మోసం చేసినట్లే. ఈ వాటర్ ఫౌంటెన్‌లు ఉన్నది చీరాలలోని మున్సిపల్ కార్యాలయంలోనే, అద్భుతంగా ఉంది కదా. చీరాల మున్సిపల్ కార్యాలయంలో పలు ఆధునికీకరణ పనులు చేపట్టారు. లక్షల రూపాయలతో కార్యాలయంలో వాటర్ ఫౌంటేన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం లోపల ఉన్న అందమైన శిల్పానికి చుట్టూ రంగురంగుల విద్యుత్ దీపాలతో పాటు వాటర్ ఫౌంటేన్‌లను ఏర్పాటు చేశారు. అలానే కార్యాలయం బయట ఉన్న తెలుగుతల్లి విగ్రహం చుట్టూ వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చే మార్గంలో ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. పలు సమస్యలపై అధికారులతో మాట్లాడేందుకు వచ్చే వారిని నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు, వాటర్ ఫౌంటెన్‌లు ఎంతో ఆకర్షిస్తున్నాయి.



కార్యాలయం లోపలికి వచ్చే మార్గంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్మని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా సుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరైన 284 మంది రోగులకు డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మార్టూరు: వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మార్టూరులో 400 మందికి పరీక్షలు..

మార్టూరు: మార్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మార్టూరు రోటరీ క్లబ్, గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో కిడ్నీ, గుండె, కళ్లు, దంత, స్త్రీ సంబంధిత మొదలైన వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్, గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వైద్యశిబిరంలో పాల్గొన్నారు.

165 మందికి కంటి పరీక్షలు..

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం బీబీహెచ్ 1992 పదో తరగతి పూర్వ విద్యార్థులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి శంకర్ కంటి వైద్యశాల నుంచి డాక్టర్ బిపిన్, డాక్టర్ రూతూజ 165 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 66 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. 38 మందికి పెదకాకాని లోని కంటి వైద్యశాల్లో శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. తదుపరి రెండో విడతలో మిగిలిన వారికి కంటి ఆపరేషన్‌లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం సుధీర్‌కుమార్, క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు, కార్యదర్శి ఏవి సురేష్, చార్టర్ అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం, కారంచేటి శివరామకృష్ణ, కొత్తవాసు, సున్నా నాగేంద్రబాబు, రవికుమార్, ఖదీర్‌బాషా, కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.



వాడరేవులో పరీక్షలు చేస్తున్న వైద్యులు



వేటపాలెం: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పర్చూరులో భారీ వర్షం

పర్చూరు (చినగంజాం): పర్చూరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలు వాతవరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పర్చూరులో నిత్యం రద్దీగా ఉండే రోడ్లు వర్షం కారణంగా నిర్మానుష్యంగా మారిపోయాయి. గతకొన్ని రోజుల నుంచి వర్షభావం కారణంగా మిరప పంట ఎండి పోయేదశలో వుంది. ఈవర్షం మిరప పంటకు మేలు కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.



భారీగా కురుస్తున్న వర్షం

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయణం, నిజశ్రావణ మాసం, పూర్వాషాఢ నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని కొండపై నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా విద్యుత్ టవర్లు ఏర్పాటు చేసేందుకు లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్లు తొలగించేందుకు సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు 33/11 హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తారని డీఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోర్టు సెంటర్, రాజాపానగల్ రోడ్డు, శ్రీగిరి కొండ మీద, గద్దలగుంటలోని కొంత భాగాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఒంగోలు: పదోన్నతులు, బదిలీలు తరువాత ఉపాధ్యాయులకు చెల్లించని జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర నాయకులు పీవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వద్ద ఈ మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షులు కేవీజీ కీర్తి, ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వై.వెంకట్రావు, జిల్లా అసోసియేటెడ్ ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, పి.రంగారెడ్డి, సీహెచ్ కొండయ్య, వై.వెంకటేశ్వర్లు, బి.వెంకట్రావు, కె.సుబ్బారావు, ఎం.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి ప్రతిష్ట మహోత్సవాలు

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామ సమీపంలో ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండం వద్ద ఈనెల 31 నుంచి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ప్రతిష్ట మహోత్సవాలకు అంకురార్పణ చేస్తున్నారు. ఇప్పటికే కొణిదెన, గంగపాలెం గ్రామాలకు చెందిన భక్తుల సహకారంతో బ్రహ్మకుండం వద్ద గల మర్రిచెట్టు కింద అరుగు ఏర్పాటుతో వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, జంట నాగులు, దక్షిణామూర్తి, శివపార్వతుల విగ్రహాలతోపాటు నవగ్రహభవనాన్ని ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంతంలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు సమాయత్తమవుతున్నారు. రాజుపాలెం గ్రామానికి చెందిన ఐనవోలు సీతారామాచార్యులు బృందంచే త్రయాత్మిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం యాగ శాల ప్రవేశంతో అంకురార్పణ, శుక్రవారం పంచముఖ ఆంజనేయస్వామికి గ్రామోత్సవం శనివారం ఉదయం 10.42 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం అన్నదానం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మూడు రోజులు జరిగే వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని ఆంజనేయస్వామి ఆశీస్సులతోపాటు కృపా కటాక్షాలు పొందాలని గ్రామస్తులు తెలిపారు.



ఆంజనేయ విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పర్చూరు (చినగంజాం): మండలంలోని నాగులపాలెం గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నాగులపాలెం గంగ పేరుతో ఆదివారం రోటరీ క్లబ్ సీడీజీ జాష్టి రంగారావు ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షుడిగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగుబండి శ్రీనివాసరావు వ్యవహరించారు. పర్చూరు రోటరీ క్లబ్‌కు సీడీజీ జాష్టి రంగారావు చేసిన సేవలను పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, కార్యదర్శి పాటోలు వెంకన్నలు కొనియాడారు. తను డీజీగా ఉన్న కాలంలో పర్చూరు వాటర్ ప్లాంట్‌ను స్థాపించడానికి సహాయ సహకారాలు అందించానన్నారు. దాతలు ముద్దన హరిబాబు మాట్లాడుతూ నాగులపాలెం గంగకు తన పూర్తి సహాయ సహకారం అందిస్తానని తెలిపాడు. సభలో ముఖ్య అతిథులు జాష్టి రంగారావు, ముద్దన హరిబాబు, మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్, నాగులపాలెం సర్పంచ్ డీ సుధారాణి, వైస్ సర్పంచ్ ఏ రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్స్‌గా భవనం రాజగోపాలరెడ్డి, తేళ్ల రమేష్‌చంద్ర బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కేఎస్ఆర్‌కే ప్రసాద్, పీ ఉదయభాస్కర్, కే ఆంజనేయులు,కే అశోక్ కుమార్, తోకల కృష్ణమోహన్, కే కొండల రాయుడు, డీ సత్యనారాయణ, కే సత్యనారాయణ పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆత్మగౌరవ భవనాలకు చేయూత

బల్లికురవ: తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో చాత్తాద వైష్ణవ సంఘ ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి రెండు తెలుగు రాష్ట్రాలకు ఎకరా స్థలం , రూ.1 కోటి సొమ్ము కేటాయించటం అభినందనీయమని ఆ సంఘ నవ్యాంధ్రప్రదేశ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, టీ నరేష్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి జీ. కరుణాకర్, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా నిర్మాణ పనులకు భూమి పూజతో శిలాఫలకం ఆవిష్కరించారు. పుణ్యక్షేత్రమైన శింగరకొండలో అన్నదానం సత్ర నిర్మాణానికి స్థలం కేటాయించాలని, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ యమసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు విన్నవించామని, త్వరలో స్థల కేటాయింపుతో భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామని సంఘ సభ్యులు తెలిపారు.



భవన నిర్మాణ పూజలో పాల్గొన్న మంత్రులు, సంఘ బాధ్యులు

క్రీస్తు మార్గంలో అందరూ సమానమే

మేదరమెట్ల: క్రీస్తు మార్గంలో అందరూ సమానులేనని పాస్టర్ డేవిడ్‌పాల్ అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో ఆదివారం శాంతియుత క్రైస్తవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ దేవుని సందేశాన్ని బోధించి దైవమార్గాన్ని చూపించే దైవసేవకులపై దాడిచేయడం దుర్మార్గపు చర్య అన్నారు. శాంతికి నిలయాలైన చర్చిలను కూల్చడంపై ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దైవసేవకులు, పాస్టర్‌లు పాల్గొన్నారు.



మేదరమెట్లలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కరాటేలో వేటపాలెం విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం: ఐదు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో వేటపాలెం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. చీమకుర్తిలోని బూచేపల్లి వెంకయమ్మ సుబ్బారెడ్డి కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయిలో కరాటే పోటీలు జరిగాయి. ఈపోటీల్లో వేటపాలేనికి చెందిన ఎస్ అజయ్‌శ్రీరామ్, జీ సాత్విక్, యశ్వంత్, జాన్ రొనాల్డ్ కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కరాటే మాస్టర్ వీ బ్రహ్మానాయుడు విద్యార్థులను అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

గంగవరంలో నేత్రదానం

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన చిలుకూరి రామయ్య (77) ఆదివారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతుడి భార్య సరోజిని, కుమారుడు బ్రహ్మయ్య, జయలక్ష్మి, పార్థు, కుమార్తె కొసరాజు రాజేశ్వరి, స్వాములు, శ్రీకాంత్, బేబిలు దాత కార్నియాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులైన జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), సోమేపల్లి రామ్మోహనరావులకు సమాచారం అందించారు. గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు.



చిలుకూరి రామయ్య